క్లుప్తంగా

రోటరీ క్లబ్ ప్రచార ర్యాలీ



ప్రచార ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ నాగరాజు రెడ్డి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలు, పథకాల ప్రచారానికి ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పట్టణ సీఐ నాగరాజు రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలో బాలికల కోసం కల్పిస్తున్న మౌలిక వసతులు, సైకిళ్ల పంపిణీ వంటి కార్యక్రమాలు అభినందనీయం అన్నారు. యువత చేడు వ్యసనాల నుంచి దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని రోటరీ క్లబ్ గవర్నర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రమేష్‌బాబు, మాజీ అధ్యక్షుడు మంగళగిరి హనుమంతరావు, శ్రీనివాస్, సంపత్, రమేష్, రామారావు, రామ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు దారి ఏర్పాటు



తాత్కాలిక దారిని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకులు

దమ్మపేట: మండల కేంద్రంలోని బంజారా కాలనీ పరిధిలో ఉన్న వంతెనకు, అనుసంధాన రోడ్డుకు మధ్య లింకు తెగిపోగా.. విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ నాయకులు సిమెంట్ స్తంభాలతో తాత్కాలిక దారిని ఏర్పాటు చేశారు. స్థానికుల ఇబ్బందులను గమనించి పొంగులేటి అనుచరులు జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో తాత్కాలిక దారిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కక్కిరాల రమేష్, చామర్తి గోపిశాస్త్రి, చక్కిరాల మల్లేశ్వర రావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

దమ్మపేట: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా నాయకుడు యార్లగడ్డ భాస్కర రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మణిపూర్ దుర్ఘటన మొదలుకొని అనేక ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం మొండివైఖరితో అనుసరించడాన్ని తప్పుపట్టారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా పనిచేసి, ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకువచ్చేలా, ప్రజలంతా ఐక్యమత్యంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, నేడు హామీలను విస్మరించడం సమంజసమేనా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో దస్తగిరి, ధర్మ, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, శాంతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

అశ్వాపురం: ఏజెన్సీ ప్రాంతంలో డెంగీ, మలేరియాతో ప్రజలు ఇబ్బంది పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారని తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అశ్వాపురం మండలం చింతిర్యాల కాలనీలో ముగ్గురు, బూర్గంపాడు మండలం సోంపల్లిలో ఐదుగురు డెంగీతో చనిపోయారన్నారు. జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాలను హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి దోమ తెరలు పంపిణీ చేయాలని, దోమల నివారణకు స్ప్రేయింగ్ పనులు చేయించాలని అన్నారు. గ్రామాల్లో జ్వర బాధితులను గుర్తించేందుకు రక్త పరీక్షలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో టీజేఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సురకంటి ప్రభాకర్‌రెడ్డి, పిప్పల్ల శ్రీనివాస్, పుల్లయ్య, మధు, సాయి తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీలు అందజేత

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామానికి చెందిన వరుపుల చిన్న అప్పారావు (తాజి), సీతారామారావు, రాంబాబు, అరుణకుమారిలు తమ తల్లిదండ్రులైన వరుపుల అప్పలస్వామి నారాయణమ్మల జ్ఞాపకార్థం 10 సిమెంట్ బల్లలను దుమ్ముగూడెం, ములకపాడు గ్రామపంచాయతీలకు ఆదివారం అందజేశారు. తమ తల్లి నారాయణమ్మ 100వ పుట్టిన రోజు సందర్భంగా సుమారు రూ.40 వేల విలువచేసే ఈ సిమెంటు బల్లలను అందించినట్లు తెలిపారు.

సా...గుతున్న నిర్మాణాలు

- అద్దె భవనాల్లో కొత్త జీపీ కార్యాలయాలు
- నిధులు మంజూరైనా పనుల్లో జాప్యం
- స్థల వివాదాలతో అడ్డంకులు



కొనసాగుతున్న సంద్రలబోడు గ్రామ పంచాయతీ కార్యాలయం భవన నిర్మాణ పనులు

అశ్వాపురం: మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా నూతనంగా ఏర్పడిన 11 గ్రామ పంచాయతీలకు పంచాయతీ కార్యాలయాల భవనాల లేక పాలకవర్గాలు, ప్రజలు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో పాలన సాగుతోంది. పంచాయతీ పాలకవర్గ సమావేశాలు, ఇతర సమావేశాలు ఆరుబయటే నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాల భవనాల నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. మండలంలో 11 జీపీ భవనాలకు రూ.20 లక్షలు చొప్పున మంజూరయ్యాయి. నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల జాప్యంతో పనులు ముందుకు సాగడం లేదు.

స్థలాల విషయంలో వివాదాలు..

పంచాయతీ కార్యాలయాల భవన నిర్మాణాలకు రెవెన్యూ అధికారులు కేటాయించిన స్థలాల్లో వివాదాలున్నాయి. రెవెన్యూ అధికారులు కేటాయించిన స్థలాల్లో భవన నిర్మాణ పనులు ప్రారంభించగా స్థలాల విషయంలో స్థానికంగా వివాదాలు తలెత్తి నిర్మాణ పనులను అడ్డుకుంటున్నారు. మండల పరిధిలోని రామచంద్రాపురం, సీతరాంపురం, ఎలకలగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయాల భవన నిర్మాణాలకు కేటాయించిన స్థలాలు వివాదాలకు దారి తీసి పోలీస్ కేసుల వరకు వెళ్లి నిర్మాణాలు నిలిచిపోయాయి. ఈ సమస్య కొలిక్కి రావడం లేదు. రెవెన్యూ అధికారులు స్థలాల కేటాయింపులో నిర్లక్ష్యం మూలంగా వివాదాలు తలెత్తుతున్నాయి. ఇక చింతిర్యాల కాలనీలో పంచాయతీ భవనానికి స్థలం కేటాయింపు జరగలేదు.

నిర్మాణ పనుల్లో జాప్యం..

వివాదాలు లేనిచోట మాత్రం పనులు ముందుకు సాగడం లేదు. మండలంలో ఏడు జీపీ భవనాలకు స్థలం కేటాయింపు విషయంలో ఇబ్బందులు లేనప్పటికీ నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. సంద్రలబోడు, కల్యాణపురం, వెంకటాపురం, బట్టీలగుంపు, తురంవారిగూడెం, గొందిగూడెం కొత్తూరు, మనుబోతులగూడెం జీపీ భవనాలకు స్థలం కేటాయింపు జరిగింది. మనుబోతులగూడెం, కల్యాణపురం, వెంకటాపురంలో జీపీ భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. మిగిలిన నాలుగు జీపీ భవనాల నిర్మాణ పనులు పునాదులు, పిల్లర్ల స్థాయిలో పనులు జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీ కార్యాలయాల భవన నిర్మాణాలు వేగవంతం చేసి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు, గ్రామ పాలకులు కోరుతున్నారు.

పనులు వేగవంతం చేస్తున్నాం..



ఐటీడీఏ ఆధ్వర్యంలో ఎస్‌డీఎఫ్ నిధులతో బట్టీలగుంపు, తురంవారిగూడెం, గొందిగూడెం కొత్తూరు, ఎలకలగూడెం, మనుబోతులగూడెం జీపీ భవనాలకు నిధులు మంజూరయ్యాయి. ఎలకలగూడెంలో స్థలం విషయంలో వివాదం జరుగుతోంది. మిగతా నాలుగు జీపీ భవనాలు పనులు జరుగుతున్నాయి. పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్, ఏఈ ఐటీడీఏ

మహిళా కాంగ్రెస్ పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరయ్య

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో రాబోయే సార్వత్రిక ఎన్నికల సమరంలో మహిళా కాంగ్రెస్ పాత్ర కీలకమని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన మహిళా కాంగ్రెస్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. త్వరలో జరగబోయే ఎన్నిలను దృష్టిలో ఉంచుకుని మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు ప్రారంభించిన్నట్లు తెలిపారు. జిల్లా నుంచి బూత్ స్థాయి వరకు కాంగ్రెస్ ప్రకటించిన డిక్లరేషన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లె బాధ్యత మహిళ కాంగ్రెస్‌పై ఉందన్నారు. సమావేశంలో మహిళా డీసీసీ ప్రెసిడెంట్ తోట దేవి ప్రసన్న, ఖమ్మం పార్లమెంట్ మహిళ కోఆర్డినేటర్ అమర్జా మహా బేగ్, రాజేశ్వరి, సరిత, జ్యోతి, దివ్య, కల్యాణి, లక్ష్మి, శ్రీలక్ష్మి, రాణి, నీరజ, జయ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య క్రైస్తవుల శాంతిర్యాలీ



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాలు

మణుగూరురూరల్: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ.. ఐక్య క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మణుగూరులో శాంతిర్యాలీ నిర్వహించారు. సురక్షా బస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ తెలంగాణ చౌరస్తా, సినిమా హాల్ సెంటర్ మీదుగా అంబేడ్కర్ సెంటర్‌కు చేరుకుంది. అంబేడ్కర్ సెంటర్‌లో క్రైస్తవులు మానవ హారంగా ఏర్పాటయ్యారు. ఈ సందర్భంగా ఐక్య క్రైస్తవ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులకు పాల్పడడం, చర్చీలను కొల్లగొట్టడం, ప్రార్థనా ఆలయనాలను తగులబెట్టడం దారుణమన్నారు. ఈ చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అనేక క్రైస్తవ కుటుంబాలు భయభ్రాంతులకు గురవుతున్నాయన్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ మణిపూర్ ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జరుగుతున్న దాడులను అరికట్టి.. క్రైస్తవ ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్య క్రైస్తవ సంఘాల నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

వసతి గృహం సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువజన నాయకులు

మణుగూరురూరల్: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు మండలంలోని అశోక్‌నగర్‌లో ఉన్న గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహాన్ని బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు ఆదివారం సందర్శించారు. యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు మట్టపల్లి సాగర్ విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్ఎంపీ డాక్టర్ కోటి సహాయంతో విద్యార్థులకు పరీక్షలు చేశారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక వైద్యసేవలు అందించేలా ఎమ్మెల్యే ద్వారా కృషి చేస్తామని తెలిపారు. అలాగే విద్యార్థులకు అవసరమైన వాలీబాల్ కిట్లను అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకులు పాల్గొన్నారు.

రహదారికి హరిత పందిరి



ఆసుపాక-నందిపాడు మార్గంలో హరిత పందిరిలా అల్లుకున్న చెట్లు

అశ్వారావుపేటరూరల్: ఈ ప్రధాన రహదారి వెంట కనిపిస్తున్న పచ్చని వృక్షాలు హరితహారం పథకంలో నాటినవి అనుకుంటే పొరపాటే. సహజ సిద్ధంగా ప్రకృతి ఒడిలో పెరిగిన అటవీ వృక్షాలు. ఇలా దారి పొడవునా పెరిగిన ఈ వృక్షాలు ప్రస్తుతం వర్షాలకు పచ్చగా చిగురించాయి. పచ్చని అందాలతో రహదారికి ఇరువైపులా కనువిందు చేస్తూ, పందిరిలా అల్లుకున్నాయి. అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామం నుంచి నందిపాడు గ్రామం వరకు విస్తరించి ఉన్నాయి. ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రోడ్డు వెంబడి చెట్ల దృశ్యాలను ఆదివారం 'సాక్షి'తన కెమెరాలో క్లిక్ మనిపించింది.

కాంగ్రెస్ పార్టీని ఆదరించాలి

అశ్వారావుపేటరూరల్: అన్ని వర్గాలకూ మేలు జరగాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని దబ్బతోగు, దబ్బతోగు కాలనీ, కామయ్యనగర్, వినాయకపురం కాలనీ గ్రామాల్లో ఆదివారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలు, మేనిఫెస్టో ప్రచార పత్రాలను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా కాంగ్రెస్ పార్టీని ఆదిరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జూపల్లి ప్రమోద్, హరిబాబు, దిలీప్, అల్లాడి రామారావు, ఎస్.నరసింహారావు, సోడెం వెంకన్నబాబు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తుంది..

దుమ్ముగూడెం: కేంద్రం, రాష్ట్రాల్లో ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు తెల్లం శేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని రేగుబల్లి గ్రామంలో బీజేపీ సమావేశం జెట్టి వెంకటరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల నాయకులు అపక శ్రీనివాస్, కుర్సం వసంతరావు, తెల్లం చలపతి, పునెం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

'వసుధ వందన్' నిర్వహణ

భద్రాచలంటౌన్: బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో వసుధ వందన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని సరస్వతి శిశుమందిర్, ఇండస్ట్రియల్ ఏరియా అశోక్ నగర్ కాలనీలలో 75 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రామోహన్ రావు, సత్యనారాయణ, నరసింహారావు, శ్రీనివాస్, వెంకటసుబ్బయ్య, కోటేశ్వరీ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

మణుగూరురూరల్: కాంగ్రెస్ మాజీ కేంద్రమంత్రి రేణుకాచౌదరి జన్మదిన వేడుకలను ఆ పార్టీ మండల నాయకుడు గురిజాల గోపి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ కార్యాలయంలో రేణుకాచౌదరి పుట్టినరోజు కేక్‌ను నాయకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామానుజవరం ఆదరణ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బిర్యానీ భోజనం వడ్డించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండి.నూరుద్దీన్, ఎండి.షరీఫ్, ఎస్‌కె.షాబీర్, కొండ్రు ముత్తయ్య, ఎం.కిషన్, కె.శేఖర్, వంశి, మాధవరెడ్డి, రమాదేవి, సాయి, రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

భద్రాచలంటౌన్: పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్ ఆవరణలో ఆదివారం ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం పేదలకు దుస్తువులు అందజేసి, అన్నదాన చేపట్టారు. కార్యక్రమాలను ఎమ్మెల్యే వీరయ్య ప్రారంభించి మాట్లాడుతూ.. భద్రాచలం డివిజన్‌లోని అనేక మంది పేదలకు అండగా నిలిచిన వ్యక్తి ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు అని అన్నారు. పాత మార్కెట్‌లో అనేక మంది చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూతనిచ్చి వారి అభివృద్ధికి తోడ్పాటు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బుడగవ శ్రీనివాస్, రమణ, రవికుమార్, సుదీర్, వెంకటేశ్వరరావు, రాము, రామారావు, శ్రీనివాస్, తిరుమలరావు పాల్గొన్నారు.

త్రివర్ణ పతాకాల పంపిణీ



చర్ల: కుదునూరులో జాతీయ జెండాలను ఇంటింటికి అందజేస్తున్న జవాన్లు

చర్ల: ఇంటింటా త్రివర్ణ పతాకాలు ఎగరాలని, ఆ క్రమంలోనే ఇంటింటికీ జెండాలను పంపిణీ చేస్తున్నామని సత్యనారాయణపురం సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ కమాండెంట్ సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్ కొత్తగూడెం, సత్యనారాయణపురం, కుదునూరు, పూసుగుప్ప, ఉంజుపల్లి, వద్దిపేట, వెంకటచెరువు, ఎర్రంపాడు, బత్తినపల్లి, దానవాయిపేట తదితర గ్రామాల్లో ఆదివారం సీఆర్‌పీఎఫ్ జవాన్లు జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ సంజీవ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో సెకెండ్ ఇన్ కమాండెంట్ సునీల్, డిప్యూటీ కమాండెంట్ పీయూస్ తివారీ, సీఎంఓ బినోద్ టొప్పో, అసిస్టెంట్ కమాండెంట్ హెచ్ బర్లా, సుబేదార్ మేజర్ అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: స్వాతంత్ర్య అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలని సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ చావురా పిలుపునిచ్చారు. ఆదివారం సీఆర్‌పీఎఫ్ ఏ 141 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్‌దార్ ఆదేశాల మేరకు స్వాతంత్ర్య అమృత్ మహోత్సవంలో భాగంగా మహాదేవపురం, లక్ష్మీనగరం, అచ్చితాపురం గ్రామాల్లో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నూప సుమిత్ర, తెల్లం కృష్ణవేణి, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

మణుగూరురూరల్: ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఇఫ్టూ జిల్లా నాయకుడు మిడిదొడ్ల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని రామానుజవరం పంచాయతీలోని సింగరేణి నిర్వాసిత గ్రామమైన పెద్దిపల్లిని ఇఫ్టూ నాయకులు సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధి పనులు, పాఠశాలల నిర్మాణాలను అటవీశాఖ అధికారులు నిబంధనల పేరుతో అడ్డంకులు సృష్టించడం సరికాదన్నారు. ఆదివాసీ పిల్లల విద్యాభివృద్ధికి ఫారెస్ట్ అధికారులు సహకరించి ప్రోత్సహించాలని కోరారు. మౌలిక వసతుల కల్పనకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు మంగీలాల్, సాధనపల్లి రవి, గ్రామ పెద్ద మడకం బాబురావు, గ్రామస్తులు ఎం.రాజు, ఉంగయ్య, బి.జోగయ్య, మంగయ్య, ఎస్.ఐతయ్య, కె.దేవయ్య, భీమయ్య, సోమయ్య, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేటలో ఎమ్మెల్యే పర్యటన



బీపీ పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట: స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదివారం మండల కేంద్రంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం దమ్మపేట గ్రామంలో భవన నిర్మాణ రంగ కార్మికులకు నిర్వహించే సంపూర్ణ వైద్య పరీక్షల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించారు. వైద్య సిబ్బంది ఎమ్మెల్యేకు బీపీ పరీక్ష చేశారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు నూతన గుర్తింపు కార్డులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ముస్లింల ఖబరస్తాన్‌కి రూ.5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ప్రహరీకి శంకుస్థాపన చేశారు. అంతకు ముందుగా తాటిసుబ్బన్నగూడెంలోని ఎమ్మెల్యే నివాసంలో దమ్మపేట అర్బన్ కాలనీకు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, దొడ్డాకుల రాజేశ్వరరావు, యార్లగడ్డ బాబు, అబ్దుల్‌జిన్నా, పగడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

- అపరిశుభ్రంగా వీధులు
- వ్యాధుల భయంతో ప్రజలు
- సమితి సింగారంలో దుస్థితి ఇది..



సమితి సింగారం వీధిలో పేరుకుపోయిన చెత్త

మణుగూరురూరల్: మణుగూరులోని సమితిసింగారం గ్రామపంచాయతీలోని వీధులు చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. అధికారులు చెత్తను, సైడ్ డ్రెయిన్లను సకాలంలో శుభ్రపర్చకపోవడం వల్ల విషజ్వరాలకు కారణమయ్యే దోమలు, ఈగలకు నిలయంగా సమితిసింగారం వీధులు మారాయి. మురుగువాసనతో స్థానికులకు ఇబ్బందికరంగా మారింది. సమితిసింగారం గ్రామపంచాయితీలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సాయి నగర్, అశోక్ నగర్ ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపై కూడా చెత్త భారీ స్థాయిలో పేరుకుపోయి దోమలకు, ఈగలకు నిలయాలుగా మారింది. పాదాచారులకు, ద్విచక్ర వాహనదారులకు దుర్వాసన స్వాగతం పలుకుతోంది.

సమితిసింగారం గ్రామపంచాయితీలో పలు ప్రాంతాల్లో చెత్తాచెదారం విపరీతంగా పేరుకుపోవడం ద్వారా స్థానిక ప్రజలు అనారోగ్యాల బారిన పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్, కలరా వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తాచెదారాన్ని శుభ్రపర్చడంలో, నిల్వ ఉన్న మురికి నీటిని తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

చెత్తను తొలగించాలి: శ్రీనివాస్, స్థానికుడు

సమితిసింగారం గ్రామపంచాయతీలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, అశోక్‌నగర్ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలి. ఈ చెత్త చెదారం ఉండడం వల్ల దుర్వాసనతో పాటు పెద్దలకు, చిన్నారులకు జ్వరాలు వస్తున్నాయి. అధికారులు స్పందించి చెత్త సేకరణ, తొలగింపు చర్యలు చేపట్టాలి.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



అశ్వాపురం: మొండికుంటలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



దుమ్ముగూడెం: బోనాలు సమర్పించడానికి వెళ్తున్న మహిళలు

దుమ్ముగూడెం: మండలంలోని కె.లక్ష్మీపురం గ్రామంలో గ్రామ దేవత ముత్యాలమ్మకు భక్తి శ్రద్ధలతో ఆదివారం బోనాలు సమర్పించారు. డప్పు వాయిద్యాలతో అమ్మవారి సన్నిధిలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నంది సీతారాములు, కనుబుద్ది శ్రీను, దేవా, నంది సత్యం, గంధసిరి వెంకన్న, కొన్నే రాములు, యాస నారాయణ రెడ్డి, ఆనంతుల సత్యనారాయణ, రమేష్, బిల్లా సాంబిరెడ్డి, నూకల కృష్ణ, కొంపెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట, బీజీకొత్తూరు, మల్లెలమడుగు, రామచంద్రాపురం, సత్యనారాయణ గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా ముత్యాలమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. సర్పంచ్‌లు మద్రి మల్లారెడ్డి, కోడి కృష్ణవేణి, కాకా అశోక్, ఉపసర్పంచ్‌లు సుధీర్, చావా వీరరాఘవులు, ఎంపీటీసీ కమటం నరేష్, గ్రామాల పెద్దలు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: అధిక శ్రావణ మాసం ఆదివారం సందర్భంగా సాంబాయిగూడెం గ్రామ ప్రజలు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు వేకువజామునే నిద్రలేచి ఇళ్ల వాకిళ్లను శుభ్రం చేసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులంతా అభ్యంగన స్నానాలు ఆచరించి నూతన దుస్తులు ధరించి.. ఇంటిని వేపాకు, మామిడితోరణాలతో అలంకరించుకున్నారు. బోనం వండి నెత్తిమీద పెట్టుకుని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ముత్యాలమ్మతల్లి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల వేడుకను సర్పంచ్ కాయం తిరుపతమ్మ ప్రారంభించి పూజలు నిర్వహించారు.